# రాంబాబు

మా ఇంటికీ సరిగ్గా రెండు ఫర్లాంగుల దూరంలోనే ఉంది కె. యస్. కిందర్ గార్డెన్ స్కూల్. నేను, మా ఆయన ఒకరోజు ఉదయం ఆ స్కూలుకెళ్ళి మా అబ్బాయిని లోయర్ కె. జి. లో చేర్పించాము. హెడ్‌మిస్ట్రెస్‌తో ప్రత్యేకంగా చెప్పాము. "మావాడు కాస్త అల్లరీ ఆగం జాస్తిగా చేస్తుంటాడు. మీరు ప్రత్యేకమైన శ్రద్ధతీసుకొని, వాడ్ని అదుపులో పెట్టాలి." అని.

"పిల్లలు గదండీ? వాళ్ళకు అల్లరే హాబీ! ఆటలే ప్రపంచం. నేనున్నానుగా- ముక్కుకు తాడుపోసి, మంచిమార్గంలో పెట్టడానికి" అన్నదావిడ.

మేం సంతోషించాము.

మొదటిరోజు వాడు స్కూలునుంచి ఇంటికిరాగానే అడిగాను నేను, ''సునీల్! ఎట్లావుందిరా స్కూల్? ఏంచెప్పారివాళ్ళ?"

"అమ్మా! అమ్మా!...మా క్లాసులోనే ఒకబ్బాయి ఉన్నాడు. ఇవాళంతా వాడు బెంచీమీదే నిలబడ్డాడు!" అన్నాడు సునిల్ కథచెబుతూన్నంత కుతూహలంతో.

"ఎవర్రా వాడు? ఏంచేశాడు?"

"వాడిపేరు రాంబాబమ్మా! ఒట్టి రౌడీవెధవనుకో. ఎదురు బెంచీమీద కూర్చున్న అమ్మాయి జడలో పువ్వు లాగాడు. దాంతో ఆ పిల్ల నిలబడి టీచర్‌కి చెప్పింది."

"ఆఁ!"

"టీచరేమో రాంబాబును 'రాస్కెల్' 'ఇడియట్' అని తిట్టి, బెంచీమీద రోజంతా నిలబడమని పనిష్‌మెంట్ ఇచ్చింది."

"అంత గడుగ్గాయన్నమాట వాడు!"

"అవునటమ్మా! రోజూ ఏదో ఒక కొంటెపని చేస్తాడట. తిట్లు తింటాడట. పనిష్‌మెంట్ తీసుకుంటాడట."

"నీకెందుకులేబాబూ! నువ్వు బుద్ధిగా

ఖమ్మంమెట్టు ప్రభా చౌధురి

ఉండు. ఎవరిజోలికీ పోకు. టీచర్లు చెప్పేది శ్రద్ధగా విని, చక్కగా చదువుకో!" అన్నాను నేను బుజ్జగింపుగా

మా సునిల్ ఆ స్కూల్లో చేరిన దగ్గర్నుంచీ రాంబాబునుగురించి రోజుకో కథ చెప్పసాగాడు. నేనూ, మా ఆయనా ఇంటరెస్టింగ్‌గా వినసాగాము. ఒకరోజు రాంబాబు తెల్లటి పరికిణీ కట్టుకొచ్చిన ఆడపిల్లమీద ఎర్రసిరా చల్లాడట. మరో రోజు రాంబాబు ఒక స్టూడెంట్‌ను కొట్టి, బలవంతాన జోకర్‌స్టిక్కర్ లాక్కున్నాడట. ఇంకోరోజు రాంబాబు గేమ్స్‌లో ఒక స్టూడెంట్ ముక్కుమీద నెత్తురు పడేట్టు కొట్టాడట. మరింకోరోజు రాంబాబు బోర్డుమీద ఛాక్‌పీస్‌తో కోతిబొమ్మ వేసి 'టీచర్' అని వ్రాశాడట. ఇట్లా రాంబాబును గురించి మా సునీల్ రోజూ చెబుతూంటే ఆసక్తిగా నేను, మాఆయనా వింటూవచ్చాము.

ఆ రాంబాబు యెవరో నేను చూడలేదు. మా అబ్బాయి వర్ణనబట్టి, వాడికి ఏడేళ్ళట. చదువురాని మొద్దట. వాళ్ళ నాన్న పెద్ద ఆఫీసరట. వాళ్ళకు కారుందట. రాంబాబు ఎర్రగా, బొద్దుగా, ముచ్చటగా వుంటాడట. ఆ పిల్లవాడ్ని అంత అకతాయితనంగా, అల్లరిచిల్లరగా, అదుపూఆజ్ఞాలేకుండా ఎందుకు వదిలేశారో నాకు అర్థంకాలేదు. మా వారు అదే అభిప్రాయాన్ని వెలిబుచ్చారు.


"తండ్రి పెద్ద ఆఫీసరట! అట్లాంటపుడు కుర్రవాడ్ని గాలికెందుకు వదిలేస్తారబ్బా! ఎక్కడో ఏదో లోపం వుండివుంటుంది. రాంబాబుమీద తలిదండ్రులకు శ్రద్ధ లేదేమో!

స్కూల్లో రాంబాబుచేసే అల్లరి, దుర్మార్గాలు, అనుభవించే శిక్షలూ నిత్యమూ సునీల్ చెబుతుండగా వింటూనే ఉన్నాము. దీపావళికి మూడ్రోజులు ముందు-ఒక ఉదయం టీచర్ కుర్చీకింద టపాకాయ పెట్టాడట రాంబాబు. టీచర్ వచ్చి కుర్చీలో కూర్చోగానే టపాకాయ 'ఢాం' అని మోగిందట. టీచర్ ఎగిరి గంతేసిందట. ఎవరా దుండగం చేసిందని వాకబుచేస్తే 'రాంబాబు' అన్నారట అందరూ. వెంటనే ఆమె రాంబాబు చెవినిపట్టుకొని హెడ్‌మిస్ట్రెస్ దగ్గరకు తీసుకెళ్ళిందట. స్కూల్‌నుంచి డిస్మిస్ చేస్తానని హెడ్‌మిస్ట్రెస్ వార్నింగ్ ఇచ్చిందట. అయినా రాంబాబు రోజూ మామూలుగానే స్కూల్‌కు వస్తున్నాడట.

"మరి అట్లాంటి డేంజరస్ బాయ్‌ని డిస్మిస్ ఎందుకు చేయలేదురా సునీల్?" అన్నాను నేను.

"ఏమోనమ్మా! ఇప్పుడు రాంబాబు బుద్ధిగానే వుంటున్నాడు. అల్లరి చేయడంలేదు." అన్నాడు సునీల్ బుంగమూతిపెట్టి.

"ఎప్పట్నుంచిరా?"




"వార్నింగ్ ఇచ్చినదగ్గర్నుంచీ."

"పోనీలే, బుద్ధితెచ్చుకున్నాడేమో!" అన్నాను నేను.

"ఏమైనా అలాంటి పిల్లలు వుండటం స్కూల్ కే ప్రమాదం. మిగతా పిల్లలు త్వరగా చెడిపోతారు" అన్నారు మావారు.

తర్వాత వారంరోజులకు పేరెంట్స్ డేకి మాకు ఆహ్వానం వచ్చింది. మావారికి ఆఫీసువుంది. నేను వెళదామనుకున్నాను. నన్ను వెళ్ళమనికూడా మావారు చెప్పారు. అయితే ఎందుకో మా సునీల్ అభ్యంతరాన్ని వెలిబుచ్చాడు

''ఎందుకమ్మా'' పేరెంట్స్ డేకి పేరెంట్స్ ఎవరూ రారు. నువ్వు రావడం దండగ'' అన్నాడు మావాడు, ఆముదంపుచ్చుకొన్న మొహంపెట్టి.

అయినప్పటికి నేను వాడిమాటను లక్ష్యపెట్టలేదు. రాంబాబుని, రాంబాబు పేరెంట్స్ని చూడాలని నాలో చెప్పరాని కుతూహలం బయలుదేరింది. ఉదయం తొమ్మిదిన్నరకు మావారు అటు ఆఫీసుకు వెళ్ళగానే, స్కూలుకు వెళ్లాను నడిచే.

క్లాసుటీచర్ దగ్గర స్టూడెంట్సూ, కొంతమంది పేరెంట్సూ ఉన్నారు. స్టూడెంట్స్ నందర్నీ పరికించి, పరిశీలనగా చూశాను-ఎర్రగా, బొద్దుగా, ముచ్చటగా వుండే రాంబాబుకోసం. కాని నాకు అలాంటి అబ్బాయి యెవరూ కనిపించలేదు. మా సునీల్ ని అడిగాను "రాంబాబు ఎవర్రా," అని. వాడు నాలుగుగోడలకేసి నిలువుగా చూశాడు. క్లాసుటీచర్ని అడిగాను. "మీ క్లాసులో రాంబాబు అనే కుర్రాడు ఉన్నాడట గదండీ? బహు అల్లరిచేస్తాడట. మీరు యెప్పుడూ పనిష్మెంట్ యిస్తారట!"

"రాంబాబా? క్లాసులోనా? ఆ పేరుగల కుర్రవాడెవరూ మా క్లాసులో లేరండీ!" అన్నది టీచర్ కనుబొమ్మల మధ్య ఆశ్చర్యాన్ని ప్రకటిస్తూ.